WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com


# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 338 సోమవారం 20 -4-2026 | పేజీలు : 4 | వెల : 5-00


## నరేంద్ర మోదీ ప్రసంగం కొత్త రాజకీయ వివాదానికి దారి

**ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై విపక్షాల ఆగ్రహం**

**ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు**



న్యూఢిల్లీ, **నవతరం:** చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ(131వ సవరణ) బిల్లు లోక్‌సభలో వీగిపోయిన దరిమిలా ప్రధాని నరేంద్ర మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగం కొత్త రాజకీయ వివాదానికి దారి తీసింది. అధికారిక జాతీయ ప్రసంగాన్ని ప్రధాని మోదీ పక్షపాత రాజకీయ ప్రసారంగా మార్చివేశారని పలువురు విపక్ష నేతలు ఆరోపించారు. తామేమీ తప్పులు చేయలేదని.. బీజేపీ ప్రభుత్వమే తప్పులు చేసిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించని ఆ పార్టీ అధికారంలోంచి దిగిపోవాలని వారు డిమాండ్ చేశారు. గత 12 ఏండ్లుగా చెప్పుకోదగ్గదేమీ సాధించలేక, నిరాశ నిస్పృహలకు లోనైన మోదీ జాతిని ఉద్దేశించి చేసే అధికారిక ప్రసంగాన్ని బురద జల్లుడు, పచ్చి అబద్ధాలతో నిండిన రాజకీయ ప్రసంగంగా మార్చారని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే విమర్శించారు.

# నేడు రైతు భరోసా రెండో విడత నిధులు




- **కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ**
- **నస్తూర్‌పల్లి బహిరంగ సభకు హాజరుకానున్న సీఎం**
- **అక్కడ్నుంచే రైతుభరోసా 2వ విడత నిధుల విడుదల**

**హైదరాబాద్, నవతరం** రాష్ట్రంలో రైతు భరోసా రెండో విడత నిధులు సోమవారం విడుదల కానున్నాయి. నెల రోజుల క్రితం తొలి విడతగా రాష్ట్రంలోని రైతులందరికీ ఒక ఎకరం వరకు భూమికి సంబంధించిన సాయాన్ని ప్రభుత్వం అందజేసిన విషయం తెలిసిందే. సోమవారం రెండో ఎకరానికి సంబం ధించిన చెల్లింపు జరగనుంది. ఉదాహరణకు ఒక రైతుకు 1 ఎకరం 20 గుంటల భూమి ఉంటే.. ఒక ఎకరానికి సంబంధించి గతంలోనే రూ.6 వేల సొమ్ము అందింది. మిగతా 20 గుంటల భూమికి ఇప్పుడు జమకానుంది.

రెండెకరాల కన్నా ఎంత ఎక్కువ భూమి ఉన్నా.. సదరు రైతులకు అందులో రెండో ఎకరానికి సంబం ధించిన రైతు భరోసా సోమవారం అందనుంది. అంటే ఎకరంలోపున్న రైతులకు తొలి విడతలోనే రైతు

- మిగతా 2లో పేజిలో

# అజారుద్దీన్‌కు పది రోజులే గడువు

- హెచ్‌సీఏ అవకతవకల కేసు కారణంగా పెండింగ్
- గవర్నర్‌ను కలిసి రిక్వెస్ట్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- అయినా అంగీకరించని గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- న్యాయసలహా తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం



2లో

# రైతు రుణమాఫీపై బుకాయిస్తున్న కాంగ్రెస్

- మంత్రి తుమ్మల మండలంలో రుణమాఫీ నిరూపిస్తే రాజీనామా: హరీశ్‌రావు
- ఏపీకి మేలు కోసం ప్రాజెక్టుల పడావు
- వడ్లు, మక్కలు కొనే దిక్కులేదు
- ఖమ్మం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ధ్వజమెత్తిన మాజీ మంత్రి హరీశ్‌రావు



2 లో

## పవన్ త్వరగా కోలుకోవాలి




న్యూఢిల్లీ/అమరావతి, నవతరం

ఏప్రిల్ 19 ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సర్జరీ చేయించుకున్న ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషయాన్ని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మాట్లాడాను. ఆయన ఎంతో ధైర్య సాహసాలు కలిగిన వ్యక్తి. అతి త్వరలోనే కోలుకుంటారని నమ్ముతూ.. ఆయన సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సైనస్ సర్జరీ చేయించుకున్న పవన్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రధాని ఫోన్ చేసినందుకు ఎక్స్‌లో ధన్యవాదాలు తెలిపారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవడానికి మోదీ సమయం కేటాయించి మాట్లాడి , తాను త్వరగా కోలుకోవాలని కోరినందుకు కృతజ్ఞుడనై ఉంటానన్నారు. ప్రధాని మోదీ నిరంతర మార్గదర్శకత్వం, మద్దతుకు ధన్యవాదాలు తెలిపారు.

# విమర్శలకు వెరవడు.. విజన్‌ను వీడడు

- ఆయన ముందుచూపు ఫలితమే హైటెక్ సిటీ
- విభజిత ఏపీకి భవ్య రాజధానే లక్ష్యంగా అడుగులు
- అమరావతిని క్వాంటమ్ హబ్‌గా మార్చేందుకు కృషి
- రాజకీయాలకు తక్కువ టైం.. సుపరిపాలనకు ఎక్కువ
- ఆది నుంచీ ఇదే బాబు అభివృద్ధి మంత్రం
- వైసీపీ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు అవిశ్రాంత కృషి
- 22 నెలల్లోనే రూ.9.36 లక్షల కోట్ల పెట్టుబడులు ఆయన ఘనతే



(అమరావతినవతరం

'పరిపాలనపై అత్యల్ప దృష్టి.. రాజకీయంపై అత్యధిక దృష్టి పెట్టడం వల్ల ఈ దేశం సామాజికంగాను, ఆర్థికంగాను ఇప్పటికే భారీ మూల్యం చెల్లించుకుంది. ఇకనైనా పరిస్థితులు మారాలి. సుపరిపాలనకు ఎక్కువ సమయం.. రాజకీయానికి తక్కువ సమయం కేటాయించగలిగే రోజులు రావాలి. అప్పుడే ఆ సమాజం అభివృద్ధిపరంగా దూసుకెళ్తుంది' ..2003లో ప్రచురితమైన 'మనసులో మాట' పుస్తకంలో చంద్రబాబు వ్యక్తం చేసిన అభిప్రాయమిది. రెండు దశాబ్దాలు దాటినా ఆయన ఆశించిన మార్పులైతే రాలేదు.. కానీ ఆయన నేటికీ అదే అభిప్రాయానికి నిబద్ధుడై ఉన్నారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే నాయకుడిగా.. రాజకీయాలకు తక్కువ సమయం.. సుపరిపాలనకు ఎక్కువ సమయం కేటాయిద్దామని నేటికీ పదే పదే చెబుతూ కలుషిత రాజకీయాలను మార్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం 76వ పుట్టిన రోజు జరుపుకొంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మారుమూల గ్రామం నారావారిపల్లెలో పుట్టిన చంద్రబాబుకు విలక్షణ రాజకీయ నాయకుడిగా పేరుంది. ఆయన ఆలోచనలు తొలి నుంచి సమకాలీన రాజకీయ నాయకులకు భిన్నంగా ఉండేవి.కంప్యూటర్ల హవా మొదలైనప్పుడు.. రానున్న రోజుల్లో ప్రపంచాన్ని శాసించేది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగమేనని గుర్తించి.. దానికి అనుగుణంగా చకచకా పావులు కదిపిన నాయకుడు చంద్రబాబు. ఆ రోజు కంప్యూటర్లు కూడుపెడతాయా అని ప్రతిపక్ష నాయకులు అపహ్యాసం చేసినా విమర్శలకు వెరవకుండా ముందుకు వెళ్లబట్టే నేడు హైదరాబాద్ హైటెక్ సిటీగా ప్రపంచపటంలో నిలవగలిగింది. తాజాగా క్వాంటమ్ కంప్యూటర్ల హవా మొదలైంది. దేశంలో వీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన ఏకైక సీఎం చంద్రబాబు. అమరావతిని క్వాంటమ్ కంప్యూటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని నగరంగా మిగిలిపోకూడదని.. అమరావతిని

మిగతా 2లో

# జలధార అమలుకు నోడల్ కీలకం



అమరావతి, నవతరంజలధార అమలుకు సంబంధించి మండల నోడల్ అధికారులు కీలకంగా వ్యవహరించాలని, అర్బన్ మండలాల్లో కూడా నోడల్ అధికారులు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జలధార-జలహారతి కార్యక్రమంపై ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణ-నీటి భద్రత విషయంలో అన్నమయ్య జిల్లా మోడల్.. రాష్ట్రవ్యాప్తంగా అమలు కావాలన్నారు. భారీ వర్షాలు పడినా ముంపు లేకుండా కాలువలు, చెరువులను మరమ్మతులు చేయాలన్నారు. వర్షాకాలంలో చెరువులన్నీ నింపాలని చెప్పారు. రాష్ట్రంలో వివిధ దేవాలయాల్లో ఉన్న పుష్కరిణులలో నీటిని నింపేలా కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు.

# విమర్శలకు వెరవడు.. విజన్‌ను వీడడు

(మొదటి పేజి (తరువాయి)

ప్రపంచంలోనే అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దాలని తపిస్తున్నారు
వైసీపీ హయాంలో ఐదేళ్లు రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లింది. విధ్వంసాన్ని అధిగమించి తిరిగి గాడిన పెట్టేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారు. ఏ దేశమైనా అభివృద్ధిపథంలో అడుగులు వేయాలంటే.. ముందుగా ప్రస్తుతం ఉన్న ఆస్తులు, అప్పుల జాబితాను జాగ్రత్తగా పరిశీలించి దానికి అనుగుణంగా స్పష్టత, నిబద్ధతలతో వ్యూహాన్ని రచించే నాయకులు ఉన్నప్పుడే సాధ్యమని ఆయన బలంగా విశ్వసిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో అదే విధానాన్ని ఆచరిస్తున్నారు. వైసీపీ మిగిల్చిన విధ్వంసం వల్ల పేరుకుపోయిన అప్పులను ఒకవైపు.. రాష్ట్రానికి సహజసిద్ధంగా లభించిన ఆస్తులను మరోవైపు బేరీజు వేసుకుంటూ విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రాన్ని అడుగులు వేయిస్తున్నారు.

పెట్టుబడుల వేటగాడు..

చంద్రబాబు 1998లో సిలికాన్ వ్యాలీలోని శాన్‌జోస్ ప్రాంతంలోని మిల్‌పిటాస్ అనే చిన్న మున్సిపాలిటీని సందర్శించారు. అప్పట్లో 50వేల జనాభాతో ఉండే ఈ పట్టణం ఏడాదికి 40 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని పన్నుల రూపంలో ఆర్జించేది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ టెక్నాలజీ కంపెనీల నుంచే సమకూరేది. చంద్రబాబు అక్కడి అధికారులను.. ఇన్ని పరిశ్రమలను మీరెలా ఆకర్షించగలిగారని ప్రశ్నించారు. దానికి స్థానిక అధికారి తమ పద్ధతి వివరించారు. 'ఎవరైనా కంపెనీ ఏర్పాటుకు వస్తే నాలుగైదు విషయాల గురించి సమాచారం అడుగుతాం. ఎంత స్థలం కావాలి? ఎంత మంది ఉద్యోగులు పనిచేస్తారు? కంపెనీ పెట్టుబడి ఎంత? ఎంత టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.. వంటి అంశాలను అడిగి మేం అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్‌లో సమాధానాలను ఫీడ్ చేస్తాం. వెంటనే ఆ సాఫ్ట్‌వేర్.. ఆ కంపెనీ ద్వారా మా నగరానికి ఎంత పన్ను లభిస్తుంది.. ఉద్యోగుల స్థానిక ఖర్చుల ద్వారా ఎంత ఆదాయం వస్తుంది.. మొదలైన వివరాలు అందిస్తుంది. వాటి ఆధారంగా ఆ కంపెనీకి ఏయే ప్రోత్సాహకాలు ఇవ్వాలో నిర్ణయిస్తాం. ఇదంతా పారదర్శకంగా ఉండడంతో కంపెనీలు మా నగరానికి రావడానికి ఇష్టపడుతున్నాయి' అని సమాధానం ఇచ్చారు. మిల్‌పిటాస్ ఒకప్పుడు చెత్త నగరంగా పేరొందినా.. ప్రస్తుతం కాలిఫోర్నియాలోనే అత్యధిక ఆదాయం ఉన్న సంపన్న నగరమిది. నాటి నుంచి నేటి వరకు రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు చంద్రబాబు కూడా అదే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ అమలు చేస్తూ పెట్టుబడుల వేటగాడిగా పేరొందారు. కూటమి అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో రూ.9.36 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందంటే.. అది చంద్రబాబు వల్లే సాధ్యమైందంటే అతిశయోక్తి కాదు.

# లోక్‌సభలో బిల్లుకు బ్రేక్‌తో అంచనాలు తారుమారు

- **జనాభా కొత్త లెక్కల ఆధారంగానే పునర్విభజన**
- **2031లో జనాభా లెక్కలకు సమగ్రత వస్తుందని**
- **కేంద్రమంత్రి శోభా కరంద్లాజె వ్యాఖ్యలు**
- **జనాభా లెక్కల సమగ్రత, తుది నోటిఫికేషన్**
- **ఆధారంగానే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు**
- **ఆ నివేదికకు మరో రెండున్నరేండ్లు పట్టే అవకాశం**
- **ఆ తరువాతే మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్**



హైదరాబాద్, ఏప్రిల్ 19
లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుకు బ్రేక్ పడిన నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు ఆగిపోయినట్టేనా? కొత్త జనాభా లెక్కలపై సమగ్ర నివేదిక వచ్చిన తరువాతే మహిళా రిజర్వేషన్లు కొలిక్కి వస్తాయా? జనాభా లెకల సేకరణ, క్రోడీకరణ, తుది నోటిఫికేషన్, డీలిమిటేషన్ కమిటీ ఏర్పాటు, ఆ కమిటీ నివేదిక, అంతిమంగా నియోజకవర్గాల పునర్విభజన తంతు పూర్తి కావడానికి 2031 వరకు ఆగాల్సిందేనా? అప్పటి దాకా పాత డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు లేనట్టేనా? అంటే ప్రస్తుత రాజకీయ పరిణామాలు, కేంద్ర కార్మిక, ఉపాధి, ఎంఎస్ఎంఈ శాఖల సహాయ మంత్రి శోభా కరంద్లాజే చేసిన వ్యాఖ్యలను బట్టి 'అవును' అనే సమాధానమే వినిపిస్తున్నది. 106వ రాజ్యాంగ సవరణ ద్వారా తెచ్చిన 'నారీశక్తి వందన అభినయం-2023' ద్వారా మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం ఇప్పటికే ఖరారైంది.అయితే, ఈ సవరణ ఆమోదించినప్పుడు జనగణన-2027 ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పూర్తి చేశాకే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయనే షరతు పెట్టారు. ఆ షరతును తొలగించడం కోసమే ఇటీవల కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును డీలిమిటేషన్ బిల్లుతో ముడిపెట్టి రాజ్యాంగ సవరణ చేయాలని భావించింది. అయితే, బిల్లు లోకసభలో వీగిపోవడంతో అనివార్యంగా కొత్త జనాభా లెక్కల ఆధారంగానే మహిళా రిజర్వేషన్లు, నియోజకదవర్గాల పునర్విభజన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, తొలి దశ జనగణన ఇప్పటికే మొదలైంది. దేశవ్యాప్తంగా ఇది కొనసాగుతున్నది. రెండో దశ ప్రక్రియ ఫిబ్రవరి 2027లో ప్రారంభమై, మార్చి 31 నాటికి ముగుస్తుంది. ఈ రెండు నెలల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి జనాభా లెక్కలు సేకరిస్తారు.

# రీయింబర్స్‌మెంట్ రాక..అవమానం భరించలేక..విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్ సిటీబ్యూరో/రంగారెడ్డి, ఏప్రిల్ 19
హయత్‌నగర్/ఇబ్రహీంపట్నం : సర్కార్‌పై ఎంతో భరోసాతో ఉన్నత చదువులు చదువుకోవాలనుకున్న ఆ యువకుడి కలలు కల్లలయ్యాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక.. సొంతంగా ఫీజు కట్టే స్థోమత లేక..
కాలేజీలో ఎదురైన అవమానం భరించలేక ఇంజినీరింగ్ విద్యార్థి బలన్మరణానికి పాల్పడటం రాష్ట్రంలో కలకలం రేపింది. శనివారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరుగగా, విద్యార్థి ఆత్మహత్యకు కళాశాల యాజమాన్యమే కారణమం టూ మృతుడి బంధువులు, విద్యార్థి సంఘాల నేతలు ఇబ్రహీంపట్నంలోని శ్రీఇందూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్నవారిపై పోలీసులు లాఠీచార్జి చేయడంతో విద్యార్థి సంఘా లు ఆగ్రహం వ్యక్తంచేశాయి.
ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, మృతుడి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా, గొల్లపల్లికి చెందిన మ్యాదరి రమేశ్ ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌కు వలస వచ్చి హయత్‌నగర్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. కొడుకు ప్రణీత్ (21) ఇబ్రహీంపట్నంలోని శ్రీఇందూ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోగా రాలేదు. దీంతో రూ.95 వేలు ఫీజు సొంతంగా కట్టాలని కాలేజీ యజమాన్యం సూచించింది. ఫీజు కోసం తండ్రి స్వగ్రామానికి వెళ్లి అక్కడ బంగారం తాకట్టు పెట్టి బ్యాంక్ నుంచి రుణం తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

## నేడు రైతు భరోసా రెండో విడత నిధులు

భరోసా పూర్తయింది. రెండు ఎకరాల వరకు భూమిఉన్న వారికి ఇప్పుడు చెల్లింపు పూర్తికానుంది. ఇదే తరహాలో విడతల వారీగా మిగతా భూములకూ నిధులు ఇవ్వనున్నారు. ఈ చెల్లింపునకు సంబంధించి పట్టాదారు పాస్‌బుక్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. ఒక రైతుకు రెండు చోట్ల భూమి ఉండి, రెండు పాస్‌బుక్‌లు ఉంటే.. రెండింటిలోనూ ఒక్కో ఎకరానికి ఇప్పటికే చెల్లింపు పూర్తయింది. ఇప్పుడు రెండో ఎకరానికి చెల్లింపు జరగనుంది. రాష్ట్రంలో మొత్తంగా 73 లక్షల పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్నాయి.

**విడతల వారీగా నిధుల సమీకరణ**
రైతుభరోసా అమలుకోసం ప్రతి సీజన్‌కు సుమారు రూ. 9 వేల కోట్ల చొప్పున ఏటా రూ.18 వేల కోట్లు కావాలి. ఏ సీజన్‌లో అయినా ఏకమొత్తంగా చెల్లించాలంటే నిధుల సర్దుబాటు చాలా కష్టం. ఈ క్రమంలోనే ప్రభుత్వం విడతల వారీగా నిధులు ఇస్తోంది. గత నెల 23న సిద్దిపేట జిల్లా నర్మెట్ట వేదికగా తొలి విడత రైతుభరోసానను ప్రభుత్వం విడుదల చేసింది. 68,89,955 మంది రైతుల ఖాతాల్లో రూ.3,447 కోట్లు నగదు జమ చేసింది. ఎకరంలోపే భూమి ఉన్న రైతులకు విస్తీర్ణానికి అనుగుణంగా సొమ్ము చెల్లించారు. ఇప్పుడు రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.2,206 కోట్లను అందించనున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ఏర్పాట్లు చేసింది. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటుచేసే ప్రజాపాలన సభలో సీఎం రేవంత్‌రెడ్డి రెండో విడత రైతుభరోసా విడుదల చేస్తారు. దీంతో రెండు విడతల్లో కలిపి రైతులకు అందే సొమ్ము రూ.5,653 కోట్లు అవుతోంది. ఇక మూడో విడత చెల్లింపులను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని సీఎం రేవంత్ ఇప్పటికే చెప్పారు. అయితే మూడో విడతలో మరో ఎకరానికి ఇస్తారా? ఐదెకరాల వరకు పూర్తిచేస్తారా? అనే స్పష్టత రావాల్సి ఉంది.

## రైతు రుణమాఫీపై బుకాయిస్తున్న కాంగ్రెస్

ఖమ్మం, ఏప్రిల్ 19 /ఖమ్మం సిటీ : రాష్ట్రంలో రైతు రుణమాఫీ పూర్తిగా అమలైందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నిరూపిస్తే తక్షణం రాజీనామా చేస్తానని, ఇందుకు మంత్రి సిద్ధమా? అని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు సవాల్ విసిరారు. తుమ్మల ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలోని ఏ గ్రామంలోనైనా క్షేత్రస్థాయి పరిశీలనకు సిద్ధమని, 100 శాతం రైతు రుణమాఫీ పూర్తయిందని నిరూపిస్తే తక్షణం రాజీనామా చేస్తానని, ఇదే విషయంపై తుమ్మల సిద్దిపేటకు వచ్చి రైతులను అడిగి నిరూపించినా రాజీనామాకు సిద్ధంగా ఉన్నానని తేల్చిచెప్పారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా ఆదివారం ఖమ్మం మమత కాలేజీ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో నిర్వహించిన భారీ ఆత్మీయ సమ్మేళన సభలో హరీశ్ పాల్గొన్నారు.తెలంగాణ సమాచారం
నేతల సమక్షంలో అజయ్ బర్త్‌డే కేక్ కట్ చేశారు. అనంతరం ఆయనను అతిథులు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు 'రేవంత్ పోవాలి..కేసీఆర్ రావాలి' అని కోరుకుంటున్నారని, అందరి నోటా ఒకేమాట వినిపిస్తున్నదని చెప్పారు. రెండున్నరేండ్లుగా అన్నివర్గాలను బుకాయిస్తూ కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని మండిపడ్డారు. రుణమాఫీ చేసేందుకు చేతకాకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పాలి తప్ప అబద్ధాలు చెప్పడం ఎందుకని ప్రశ్నించారు.

## అజారుద్దీన్‌కు పది రోజులే గడువు

హైదరాబాద్, ఏప్రిల్ 19 : రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేసేందుకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా అభ్యంతరం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆర్థిక అవకతవకల కేసులో ఈడీ విచారణ ఎదుర్కొన్న నేపథ్యంలో ఆయన్ను నేరుగా ఎమ్మెల్సీగా ఆమోదించేందుకు అంగీకరించలేదని తెలిసింది. న్యాయనిపుణుల సలహా తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ తేల్చిచెప్పినట్టు తెలిసింది. అజారుద్దీన్‌కు మరో 10రోజులే డెడ్‌లైన్ ఉన్నది. ఆయన మంత్రిగా కొనసాగాలంటే ఈలోగా ఎమ్మెల్సీ కావాల్సిన అనివార్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం గవర్నర్‌తో భేటీ అయినట్టు సమాచారం. గవర్నర్ కోటాలో ముద్దసాని కోదండరాంరెడ్డి, మహ్మద్ అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఇప్పటికే గవర్నర్‌కు పంపింది. ఈ ఇద్దరు పేర్లను ఆమోదించాల్సిందిగా రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను అభ్యర్థించినట్టు తెలిసింది.

# ఒప్పందం చేసుకోకుంటే భారీ దాడులు

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, ఏప్రిల్ 19: ఒక వైపు దౌత్య చర్చలు.. మరో వైపు బలప్రయోగం ముప్పు.. పశ్చిమాసియా సంక్షోభానికి తెరదించేందుకు రెండో విడత చర్చలకు సోమవారం సాయంత్రం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు తమ ప్రతినిధులు చేరుకుంటారని వెల్లడిస్తూనే మరో వైపు ఇరాన్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. 'నా ప్రతినిధులు చర్చల కోసం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్తున్నారు. వారు సోమవారం సాయంత్రం అక్కడ ఉంటారు' అని ఆయన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. తాను న్యాయమైనదిగా, సహేతుకమైనదిగా అభివర్ణించిన ఒప్పందాన్ని అంగీకరించడానికి కనుక విఫలమైతే ఇరాన్ మౌలిక సదుపాయాలు లక్ష్యంగా భారీ దాడులు చేస్తామని హెచ్చరించారు. హొర్ముజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకలపై కాల్పులకు పాల్పడటం ద్వారా ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. పూర్తిగా తెరిచిన హొర్ముజ్ జలసంధిని కొన్ని గంటలకే మూసివేస్తున్నట్టు ఇరాన్ చేసిన ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగతాళి చేశారు. ఈ విషయంలో ఇరాన్ కొంచెం తెలివిగా వ్యవహరించిందని, అయితే ఆ చర్యతో అమెరికాను బ్లాక్‌మెయిల్ చేయలేరని అన్నారు.

యుద్ధం ఎలా గెలువాలో ఇజ్రాయెల్‌కు తెలుసు
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌ను ప్రశంసలతో ముంచెత్తాడు. సంఘర్షణల సమయంలో కొన్ని దేశాలు తమ నిజస్వరూపాన్ని బయటపెట్టాయన్నారు. కానీ, ఇజ్రాయెల్ మాత్రం వాటిలా కాకుండా అన్ని సమయాల్లో తమ వెంట నిలిచిందన్నారు. ఇజ్రాయెలీలు చాలా ధైర్యవంతులు, విధేయులు, తెలివైనవారని ప్రశంసలు కురిపించారు. యుద్ధంలో ఆ దేశం గట్టిగా పోరాడుతున్నదని, ఎలా గెలువాలో దానికి తెలుసునని అన్నారు.

ఇరాన్ నౌకలను సీజ్ చేయాలని వ్యూహం
పశ్చిమాసియా సంక్షోభం ఎనిమిదో వారంలోకి చేరుకున్నా ఇరాన్ లొంగే పరిస్థితి కనపడకపోవడంతో అమెరికా మరో వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా ఇరాన్ వాణిజ్య నౌకలు, చమురు ట్యాంకర్లు ఎక్కడున్నా సీజ్ చేయాలని వ్యూహం పన్నుతున్నది. ఇప్పటికే ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధించిన అగ్రరాజ్యం.. దాని జల రవాణా వ్యవస్థను కూడా దెబ్బ తీసేందుకు చకచకా వ్యూహాలు పన్నుతున్నది.

'బాబ్ అల్ మాండెబ్‌ను మూసేస్తాం'
పశ్చిమాసియా సంక్షోభం నివారణకు జరుగుతున్న శాంతి ప్రయత్నాలకు అమెరికా అడ్డగింత ఇలాగే కొనసాగితే హొర్ముజ్‌ను ఇరాన్ మూసివేసినట్టుగానే యెమెన్‌లోని బాబ్ అల్ మాండెబ్ జలసంధిని తామూ మూసివేస్తామని హౌతీ గ్రూప్ సీనియర్ అధికారి ఒకరు ఆదివారం ట్రంప్‌ను హెచ్చరించారు. 'బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేయాలని కనుక నిర్ణయించుకుంటే అప్పుడు మానవాళి, కనిపించని అదృశ్య శక్తులు కూడా దానిని తెరువడానికి పూర్తిగా శక్తిహీనులవుతారు. కాబట్టి శాంతికి ఆటంకం కలిగించే విధానాలను యూఎస్ ముగించాలి' అని హుస్సేన్ అల్-ఎజ్జీ ఒక ప్రకటనలో కోరారు. అంతర్జాతీయ సరుకు రవాణాకు హొర్ముజ్, అల్ మండేబ్ కీలకం. వాటిని మూసివేస్తే ఇంధన సంక్షోభం మరింత పెరిగే అవకాశం ఉంది.


## కేసుల భయంతో బానిసలా బతుకాలా..?..

దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని, బీజేపీతో పెట్టుకున్న అక్రమ పొత్తు తేటతెల్లమైందని ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విపక్షం ముసుగులో ఉన్న వైఎస్సార్సీపీ సైతం ఆర్ఎస్ఎస్ పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని అన్నారు. బిల్లులను అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు ఏం సాధించాయి..? అని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించడంపై ఆమె స్పందించారు. టీడీపీ, జనసేనలను మించి మోదీని ఇంతలా మోయాలా..? మన దేశ రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే ముఖ్యమా..? అని ప్రశ్నించారు.అక్రమ డీ లిమిటేషన్ బిల్లుపై ఎన్‌డీఏ పక్షాన నిలబడ్డందుకు జగన్ సిగ్గుపడాలని షర్మిల అన్నారు. ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంటకాగాలా..? కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా..? బీజేపీ బిల్లులకు గొర్రెలా, గుడ్డిగా తలాడించాలా..? మోదీ మెప్పు కోసం సొంత కాకిలెక్కలు అల్లాలా..? అని నిలదీశారు. ఇదేనా తమరు చెప్పే వైఎస్ఆర్ ఆశయాలు, వారసత్వం..? అని ప్రశ్నించారు. మహానేత సిద్ధాంతాలను మంటగలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు ఆత్మవిమర్శ చేసుకోవాలి అన్నారు.రాజ్యాంగానికి విఘాతం కలిగించే అక్రమ బిల్లులకు విపక్షాలు అడ్డుపడి విజయం సాధిస్తే... ఏం సాధించారని ప్రశ్నించడం హాస్యాస్పదమని, కోట్లాది మంది రాష్ట్ర ప్రజల గుండెలు గాయపరచడమే మీ గొప్పతనమా అని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాల భావోద్వేగాన్ని అర్థం చేసుకోకపోవడమా మీ రాజకీయం..? అన్నారు. ప్రతిపక్షంగా విపక్షానికి మద్దతు ఇవ్వాల్సిందిపోయి అధికార పక్షానికి జై కొట్టడం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా..? అని ప్రశ్నించారు.

# వీరి మాటే-శాసనం

**● భద్రాద్రి జిల్లాలో బలి పశువు అవుతున్న చట్టం**
**● అభివృద్ధి ముసుగులో అక్రమార్కుల అడ్డా?**
**● ఫిర్యాదుదారుల సమాచారం నేరుగా ప్రత్యర్థులకే చేర వేస్తున్న ఖాకీలు?**
**● సామాన్యుడి గొంతు నొక్కడమే లక్ష్యంగా ఇన్ఫార్మర్ల దందా?**
**● బదిలీలు,సస్పెన్షన్లతో అధికారుల గుండెల్లో పాలకుల భయం**
**● చట్టాలు తమ చుట్టాలుగా,ప్రశ్నించే వారిని మట్టిలో కలిపే కుట్రలు?**
**● తమ కోటలను కాపాడుకునేందుకు అధికారులను పావులుగా వాడుకుంటున్న నేతలు**
**● జిల్లా యంత్రాంగం నిద్ర వీడేది ఎప్పుడు? పౌరుల రక్షణకు దిక్కెవరు?**




నవతరం ప్రతినిధి: ఖమ్మం భద్రాద్రి జిల్లా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోంది. జిల్లావ్యాప్తంగా పాలన గాడి తప్పుతుందా? చట్టాన్ని రక్షించాల్సిన వారే అక్రమార్కులకు రక్షణ కవచంలా మారుతున్నారా? అంటే జిల్లాలోని తాజా పరిస్థితులు అవుననే సమాధానం ఇస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం ముసుగులో 'రాక్షస పాలన' రాజ్యమేలుతోంది. జిల్లాలోని పలు మండలాల్లో అక్రమార్కుల ఆగడాలు మిన్నంటుతున్నాయి. ముఖ్యంగా అశ్వారావుపేట కేంద్రంగా సాగుతున్న రాక్షస పాలన చూస్తుంటే జిల్లాలో అసలు ప్రభుత్వం ఉందా? లేక అక్రమార్కుల గుప్పిట్లో వ్యవస్థలు బందీ అయ్యాయా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రం ఇందుకు 'కేరాఫ్ అడ్రస్'గా మారింది. జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే అశ్వారావుపేటలో పరిస్థితి అత్యంత భయానకంగా ఉంది. ఇది మండల కేంద్రం నుండి మున్సిపాలిటీగా మారిన తర్వాత అభివృద్ధి కంటే అక్రమాలే వేగంగా విస్తరించాయి. సామాన్యుడిని రక్షించాల్సిన చట్టం, నేడు అక్రమార్కులకు 'చుట్టం'గా మారిపోవడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.

### అశ్వారావుపేట మున్సిపాలిటీనీ అవినీతికి అడ్డాగా మార్చారా?

మండల కేంద్రం మున్సిపాలిటీగా రూపాంతరం చెందాక ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశించారు. కానీ, ఇక్కడ పరిస్థితి రివర్స్‌లో ఉంది. అక్రమ లేఅవుట్లు, మట్టి మాఫియా, ఇసుక దందాలు మున్సిపాలిటీ ముసుగులో యథేచ్ఛగా సాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా సహజ వనరుల దోపిడీ జరుగుతున్నా అశ్వారావుపేటలో మాత్రం ఇది పతాక స్థాయికి చేరింది. పర్మిషన్లు లేని మైనింగ్ ఇక్కడ బహిరంగ రహస్యం. పాలకుల అండదండలతో ప్రతి పనిలోనూ 'కమిషన్ల' రాజ్యం నడుస్తోందని, ప్రశ్నిస్తే చట్టపరమైన ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ వీరి మాటే శాసనం.

రక్షక భటుల 'ఇన్ఫార్మర్' పాత్ర ఫిర్యాదుదారుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ఉంది.

జిల్లా పోలీస్ వ్యవస్థపై ప్రజలకు గౌరవం ఉన్నా, కొందరు అధికారులు చేస్తున్న పనులు శాఖకే మచ్చ




తెస్తున్నాయి. అశ్వారావుపేటలో అక్రమాలు జరుగుతున్నాయని ఎవరైనా పోలీసులకు సమాచారం ఇస్తే,ఆ వివరాలను వెంటనే నిందితులకు చేరవేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పోలీసుల నుండి ముందస్తు సమాచారం అందుకుంటున్న దుండగులు ఫిర్యాదుదారుల ఇళ్ల పైకి వెళ్లి దాడులకు తెగబడుతున్నారు. అడ్డు వస్తే మట్టిలో కలిపేస్తామంటూ పాలకుల,ప్రజా ప్రతినిధుల పేర్లను వాడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నేరాలను అడ్డుకోవలసిన వారే నేరగాళ్లకు సహకరిస్తూ అన్యాయాన్ని సమర్థించడం అరాచకానికి పరాకాష్ట. పోనీ అంతటితో ఆగిందా అనుకుంటే ఇక్కడ మరో కోణంలో అధికారులు కూడా నిత్యం భయభ్రాంతులకు గురవుతూనే ఉన్నారు. రెవెన్యూ, పోలీసు,మున్సిపల్ అధికారులను బెదిరించడం లేదా లోబర్చుకోవటం ద్వారా ఇక్కడ సమాంతర పాలన సాగుతోంది. ప్రజా ప్రతినిధుల ముసుగులో ఉన్న కొందరు నేతలు అధికారులను తమ బంట్లుగా వాడుకుంటున్నారు. మాట వినని అధికారులను 24 గంటల్లో బదిలీ చేయించడం లేదా వేధింపులకు గురి చేయడం ద్వారా వ్యవస్థను తమ చెప్పు చేతల్లో ఉంచుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా రెవెన్యూ, మున్సిపల్,పోలీస్ శాఖలో నిజాయితీగల అధికారులు ఉన్నా,, వారు నోరు మేదపలేని పరిస్థితి నెలకొంది. ఈ వేధింపులకు భయపడి చాలామంది అధికారులు అక్రమాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ' జీవచ్ఛవాలు' గా మారుతున్నారు. దీంతో జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. చట్టాలను తమ సొంత ఆస్తులుగా మలుచుకున్న కొందరు ప్రజాప్రతినిధులు అధికారులను బానిసలుగా వాడుకుంటూ సామాన్యుడి గొంతు నొక్కుతున్నారు. జిల్లా కలెక్టర్,ఎస్పీ ఇకనైనా స్పందించండి. అశ్వారావుపేటలో జరుగుతున్న ఈ అరాచకాలు కేవలం ఒక మండలానికే పరిమితం కావు. ఇవి జిల్లా అంతటా విస్తరించే ప్రమాదం ఉంది. చట్టాన్ని తమ చుట్టాలుగా మార్చుకున్న వారిపై ఉక్కు పాదం మోపాలి. పోలీసు వ్యవస్థలో ఉండి నేరగాళ్లకు సహకరిస్తున్న వారిపై అంతర్గత విచారణ జరపాలి. వీరిపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. సామాన్య పౌరుడు ధైర్యంగా ఫిర్యాదు చేసే వాతావరణాన్ని కల్పించాలి. ఫిర్యాదుదారుల వివరాలు బయటకు పొక్కకుండా చూసి, ప్రజల్లో భద్రతాభావాన్ని కల్పించాలి. సామాన్యుడి ప్రాణాలకు,ఆస్తులకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలి. ఈ అకృత్యాలు జిల్లా అంతటా వ్యాపిస్తున్న ' క్యాన్సర్' లాంటివి. సాగుతున్న ఈ మాఫియా తరహా పాలనకు అడ్డుకట్ట వేయకపోతే ప్రజలు ప్రజాస్వామ్యంపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది.

## కురుమ సంఘం అభివృద్ధికి కృషిచేస్తా



బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవతరం: పేట్బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగద్గిరిగుట్ట డివిజన్ కురుమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి జగద్గిరిగుట్ట కొండపైగల మహంకాళి – బీరప్ప దేవాలయంలో సంఘ కార్యకలాపాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాల్ ను, దేవాలయ సంరక్షణకై ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని కోరుతూ సంఘ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని కులాల వారికి గతంలో ప్రభుత్వ స్థలాలను కేటాయించి వారి అభ్యున్నతికి కృషిచేసామని, రానున్న రోజుల్లో కూడా సంఘ అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు దేవరి మల్లేష్, ప్రధాన కార్యదర్శి కంచర్ల యాదగిరి, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు కుంతి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ వైస్ చైర్మన్ గా బొంగునూరి కిషోర్ రెడ్డి నియామకం



కుత్బుల్లాపూర్, నవతరం: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రోటోకాల్ చైర్మన్ గా హెచ్ వేణుగోపాల్ రావు ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ని రాష్ట్ర ప్రోటోకాల్ వైస్ చైర్మన్ గా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలతో మమేకమై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలియజేశారు.


## ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిసిన జయ క్రిష్ణ




జగద్గిరిగుట్ట, నవతరం: తన పుట్టినరోజు సందర్భంగా జగద్గిరిగుట్ట బిఆర్ఎస్ నాయకులు జయ క్రిష్ణ తన పుట్టినరోజు సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, డివిజన్ ప్రెసిడెంట్ రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, శశిధర్, స్టాలిన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకం

బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్





కుత్బుల్లాపూర్, నవతరం:
గాజులరామారం డివిజన్ సాయి గ్రామం కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, భూ గర్భ డ్రైనేజీ పనులను అభివృద్ధి పరచాలని కోరుతూ ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని, పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా ప్రతీ కాలనీలల్లో మౌళిక వసతులను అభివృద్ధి పరుస్తున్నామని, రానున్న రోజుల్లో సాయి గ్రామం కాలనీ అభివృద్ధి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, కాలనీ అధ్యక్షులు వినోద్ కుమార్ రామావత్, ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ ఆలే, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

బిఆర్ఎస్ ఎల్పివిప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



కుత్బుల్లాపూర్, నవతరం: గాజులరామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్ – బి కి చెందిన "యువ చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్" సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని, నూతన సంక్షేమ ససంఘం "యువ చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్" సభ్యులకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి. నాగ భూషణ చారి, ఉపాధ్యక్షులు వెంకటేష్ గౌడ్, వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి ఆనంద్, సలహాదారులు అశోక్, మల్లికార్జున్, రఘుపతి రాములు, సభ్యులు గణేష్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, పులి రాజు, సిద్దు గౌడ్, రాజేందర్, జె. మల్లేష్, శ్రీనివాస్, దత్తు, సంతోష్ గుప్తా, రాజు పంతులు, కేశవులు, నర్సింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్‌లు..



నందమూరి అభిమానులకు ఈ సారి మే 20 నిజంగా పండగరోజుగా మారబోతోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్‌లో మునుపెన్నడూ లేని విధంగా భారీ అప్‌డేట్స్‌ను విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒక్క సినిమా కాదు, ఏకంగా నాలుగు ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లకు సంబంధించిన ప్రకటనలు రావొచ్చని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. మొదటిగా అందరి దృష్టి ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాపై ఉంది. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్ టైటిల్ ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'కేజీఎఫ్', 'సలార్' వంటి భారీ విజయాల తర్వాత ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్‌ను ఎలా చూపిస్తారో అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను బర్త్‌డే రోజున విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇక దేవర సినిమాకు సీక్వెల్‌గా రాబోతున్న 'దేవర 2'పై కూడా క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

దర్శకుడు కొరటాల శివ ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తి చేశారని సమాచారం. అయితే షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎన్టీఆర్ షెడ్యూల్ ఎలా ఉండబోతుంది అనే విషయాలపై బర్త్‌డే రోజున అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఎన్టీఆర్ కాంబినేషన్ కూడా మరోసారి వార్తల్లో నిలుస్తోంది. '

## 'మైసా' కోసం కసరత్తులు



'పుష్ప' ఫ్రాంచైజీ, 'యానిమల్' 'ఛావా' చిత్రాలతో జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతుల్ని సంపాదించుకుంది అగ్ర నాయిక రష్మిక మందన్న. తాజాగా ఆమె 'మైసా' చిత్రంతో కెరీర్‌లోనే ఓ ఛాలెంజింగ్ రోల్‌ని పోషిస్తున్నది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో గిరిజన తెగకు చెందిన గోండ్ మహిళగా కనిపించనుంది రష్మిక మందన్న. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. ఈ సినిమాలోని యాక్షన్ ఘట్టాల కోసం రష్మిక మందన్న ప్రతిరోజూ 8 గంటల కఠోర శిక్షణ తీసుకుంటున్నది. అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండిలాంగ్ పర్యవేక్షణలో బ్యాంకాక్‌లో ఈ ట్రెయినింగ్ జరుగుతున్నది'మైసా' కథ విన్న తర్వాత పాత్ర కోసం తాను శారీరకంగా, మానసికంగా మరింత దృఢంగా కనిపించాలని రష్మిక నిర్ణయించుకుందని, యాక్షన్ ఘట్టాలన్నీ సహజంగా కనిపించాలనే లక్ష్యంతో బ్యాంకాక్‌లో స్టంట్స్, కంబాట్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదని మేకర్స్ తెలిపారు.

శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. త్వరలో కేరళలో 16రోజుల పాటు జరిగే కీలక యాక్షన్ షెడ్యూల్ కోసం రష్మిక మందన్న ఈ శిక్షణ తీసుకుంటున్నది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రవీంద్ర పుల్లె.సినిమా న్యూస్





## ధర్మ రక్షణ కోసం పరశురాముడి ఆగమనం.

భారతీయ చలనచిత్ర రంగంలో యానిమేటెడ్ చిత్రాల సత్తాను చాటిన 'మహావతార్ నరసింహ' అఖండ విజయం తర్వాత, 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రెండో అడుగు పడింది. హోంబలే ఫిల్మ్స్ మరియు క్లీమ్ ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం "మహావతార్ పరశురామ్" మోషన్ పోస్టర్‌ను నేడు పరశురామ జయంతి సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసింది.కేవలం 40 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద 300 కోట్లకు పైగా వసూళ్లతో రికార్డు సృష్టించిన 'మహావతార్ నరసింహ' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు అశ్విన్ కుమార్ విష్ణుమూర్తి దశావతారాల ఆధారంగా మొత్తం ఏడు చిత్రాలను ఈ యూనివర్స్‌లో భాగంగా రూపొందిస్తుండగా, రెండో చిత్రంగా పరశురాముడి కథను ఎంచుకున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో యుద్ధ భూమిలో రక్తసిక్తమైన గొడ్డలిని ధరించి, రౌద్ర రూపంలో ఉన్న పరశురాముడిని చూపిస్తూ "ధర్మం పతనమైనప్పుడు పరశురాముడు ఉద్భవిస్తాడు.. ఆయన పాలకుడు కాదు, అధర్మాన్ని అంతమొందించే శక్తి" అని పేర్కొనడం విశేషం. సామ్ సి.ఎస్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం అత్యాధునిక 3డి యానిమేషన్ సాంకేతికతతో సిద్ధమవుతోంది. విజయ్ కిరగందూర్ నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ చిత్రం తెలుగు, కన్నడ, హిందీ, తమిళం మరియు మలయాళ భాషల్లో 2027 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## ఆధ్యాత్మిక కలయిక..


### 'వాల్మీకి రామాయణం' కోసం జతకట్టిన ఇళయరాజా!




భారతీయ సంగీత శిఖరం, మాస్ట్రో ఇళయరాజా మరో అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. బాలీవుడ్ నుంచి ప్రతిష్టాత్మక 'వాల్మీకి రామాయణం' రాబోతుండగా ఈ చిత్రానికి ఆయన సంగీతం అందించబోతున్నాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ, ఇదొక ఆధ్యాత్మిక కలయిక.. సంగీతం ఇప్పుడు ఒక నైవేద్యం అంటూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.భావనా తల్వార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం, వాల్మీకి మహర్షి రచించిన అసలు సిసలు రామాయణ ఇతిహాసాన్ని వెండితెరపై ఆవిష్కరించనుంది. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రానికి ఇళయరాజా తన సంగీతంతో ప్రాణం పోయనున్నారు. విజువల్స్ మరియు సంగీతం పరంగా అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం 2026 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## నేపథ్యంలో టాలీవుడ్ తొలి స్పోర్ట్స్ డ్రామా.. 'వాలీ' మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన క్రిష్!

ప్రముఖ దర్శకుడు క్రిష్ జగర్లమూడి చేతుల మీదుగా విడుదలైన 'వాలీ' (ఋూఙాజ్) చిత్ర మోషన్ పోస్టర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టాలీవుడ్ తెరపై వాలీబాల్ క్రీడ నేపథ్యంలో వస్తున్న మొట్టమొదటి స్పోర్ట్స్ డ్రామాగా గుర్తింపు పొందిన ఈ చిత్రం, టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఫైర్‌వాటర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై జి. రోహన్ రెడ్డి నిర్మాణంలో, దిలీప్ కె. మనుకొండ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను క్రిష్ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మోషన్ పోస్టర్ చూస్తుంటే, ఒక గ్రామీణ నేపథ్యంలో సాగే క్రీడా పోరాటాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించబోతున్నారని స్పష్టమవుతోంది.




ఈ చిత్రం ప్రధానంగా తీరప్రాంత గ్రామీణ వాతావరణంలో సాగుతుంది. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఉండే అనుబంధం, వారి జీవితాల్లో వాలీబాల్ క్రీడ పోషించే కీలక పాత్ర, మైదానంలో వారు ఎదుర్కొనే సవాళ్లు మరియు వ్యక్తిగత భావోద్వేగాల చుట్టూ కథాంశాన్ని అత్యంత ఆసక్తికరంగా మలిచారు. ఈ సినిమాతో రోనిత్ జీఆర్‌జీ కథానాయకుడిగా వెండితెరకు పరిచయం అవుతుండగా, నిపుణ్ సత్య మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. వీరిద్దరి నటన ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఇక అభిగ్న్య వుత్తలూరు కథానాయికగా అలరించనుండగా, రవి వర్మ, కల్పలత, వడ్లమాని శ్రీనివాస్ వంటి అనుభవం ఉన్న నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

సాంకేతికంగా కూడా ఈ చిత్రం ఉన్నత ప్రమాణాలతో రూపొందుతోంది. అరుణ్ విజేకే సినిమాటోగ్రఫీ, ఔరానోవా స్టూడియోస్ అందించిన నేపథ్య సంగీతం మోషన్ పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి. పవన్ కె. విప్పర్తి మరియు దిలీప్ కె. మనుకొండ సంయుక్తంగా అందించిన కథ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా ఉంటాయని సమాచారం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పాడ వంటి అందమైన తీరప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. జి విక్రమ్ రెడ్డి సమర్పణలో వస్తున్న ఈ ప్రాజెక్టుకు శ్రీనివాస్ కారంకి సహ నిర్మాతగా, స్నేహ దాసరి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఎమోషనల్ డ్రామాను కోరుకునే ప్రేక్షకులకు 'వాలీ' ఒక సరికొత్త అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. త్వరలోనే సినిమా విడుదల తేదీ మరియు ఇతర వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు

## దూవా చేతిలో ప్రెగ్నెన్సీ కిట్..

బాలీవుడ్ స్టార్ జంట దీపికా పదుకొనే మరియు రణవీర్ సింగ్ తమ అభిమానులకు మరోసారి తీపి కబురు అందించారు. ఆదివారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా దీపికా పదుకొనే తన రెండో గర్భాన్ని ధృవీకరిస్తూ చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ క్రమంలో తన కూతురు దూవా(ఐఋు) పదుకొనే సింగ్ ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్‌ను పట్టుకున్న ఒక క్యూట్ ఫోటోను షేర్ చేసిన దీపికా, 2024 సెప్టెంబర్‌లో జన్మించిన దూవా ఇప్పుడు పెద్దక్క కాబోతోందని పరోక్షంగా వెల్లడించారు. ఎటువంటి సుదీర్ఘ సందేశాలు లేకుండా కేవలం 'దిష్టి చుక్క' ఎమోజీలను మాత్రమే క్యాప్షన్‌గా పెట్టిన ఈ పోస్ట్‌పై సినీ ప్రముఖులు సమంత, భూమి పెడ్నేకర్‌తో పాటు వేలాది మంది అభిమానులు శుభాకాంక్షల వర్షం కురిపిస్తున్నారు. మొత్తానికి దీపికా-రణవీర్ దంపతులు తమ జీవితంలో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతుండటంతో అటు కుటుంబ సభ్యుల్లోనూ, ఇటు అభిమానుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com